క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలోని మూసాపేటలోని జీహెచ్ఎంసీ కార్యాలయం, సమీప ప్రాంతలు, కైత్లాపూర్, 15వ ఫేజు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... అదేవిధంగా కైత్లాపూర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ హెచ్ఎంటీహిల్స్ ఫీడర్ పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: హెచ్ఎంటీ హిల్స్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు సమతానగర్,అడ్డగుట్ట, విజేత సూపర్ మార్కెట్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అడ్డగుట్టలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

నేడు బాల బోనాల సంబరాలు



బాల బోనాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: శ్రీరంగం ఫౌండేషన్, శ్రీ సాయి అలేఖ్య సంఘ సేవ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల బోనాల సంబరాలు 14వ తేదీ నిర్వహించనున్నారు. కూకట్‌పల్లిలోని భారత వికాస్ భవన్‌లో 10వ తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కాళోజీ ప్రతిభ పురస్కాలు 2023 ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకురాలు సాయి అలేఖ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ హాజరు కానున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం చేతుల మీదుగా ఆవిష్కరించారు.

భూమి వారోత్సవాల ర్యాలీ



ర్యాలీలో రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల బ్రాంచిలో గురువారం భూమి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. భూమి అనేది ఒక గ్రహం మాత్రమే, జీవరాశి ముగడకు అత్యంత ఆవశ్యకమైన గ్రహహని, భూమిని కలుషితం చేసే కారకాలలో అత్యంత ప్రమాదకరమైనది ప్లాస్టిక్ వినియోగమని తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవటం మనందరి ప్రాథమిక కర్తవ్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

చతుర్మాస దీక్షపై ప్రవచనం




వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీత్రిదండి దేవనాథ రామనుజ జీయర్‌స్వామి

కూకట్‌పల్లి: పరమహంస పరివ్రాజకులు శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారు చతుర్మాస దీక్షను పురస్కరించుకొని బుధవారం సాయంత్రం కేపీహెచ్‌బీ కాలనీలోని టెంపుల్ బస్‌స్టాప్ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో వికాస తరంగిణి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో గురువారం పాల్గొన్నారు. చాతుర్మాస దీక్ష గురించి, తత్త్వసాధన గురించి ప్రవచించారు. అనంతరం ఛత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు బైలూరు యోగిష్ ప్రభుత్వ నివాసం వద్ద మొక్కను నాటి, మంగళ శాసనాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ప్రజా క్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన 3 లక్షల 23 వేల రూపాయల మొత్తాన్ని గురువారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజుయాదవ్, పెద్ద భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, విద్యాసాగర్, మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆషాఢమాసం.. బోనం.. తెలంగాణ ప్రాణం

అందమైన బోనం



భవానీనగర్‌లో అమ్మవారి ఆలయంలో మాజీ కార్పొరేటర్ వెంగళరావు



మూసాపేటలో పలు ఆలయాల్లో గురువారం ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భవానీనగర్‌లోని పోచమ్మతల్లి, మూసాపేటలోని మహంకాళిమాత, గూడ్స్‌షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ తల్లి, మూసాపేట ప్రధాన రహదారిపై ఉన్న నల్లపోచమ్మ, జనతానగర్‌లోని పోచమ్మతల్లి ఆలయాల్లో మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో పాటు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అందుకే బోనం తెలంగాణ ప్రాణమని అంటారని పేర్కొన్నారు. – మూసాపేట





మూసాపేటలో కుటుంబ సమేతంగా బోనాలు సమర్పించేందుకు వెళ్తూ..



జనతానగర్‌లోని పోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష



మూసాపేటలో బోనాల ఉత్సవంలో బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు



మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహంకాళి ఆలయంలో కాంతారావు

దశలవారీగా బాలానగర్ డివిజన్ అభివృద్ధి పనులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని జేపీ ఆర్‌నగర్‌లో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా కాలంగా జేపీఆర్‌నగర్ ప్రాంతంలో ఎదురవుతున్న మంచినీటి సమస్యను నూతన పైప్‌లైన్‌తో త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. డివిజన్‌లో దశల వారీగా మురుగు నీటి, సీసీ రోడ్, విద్యుత్ ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కరీ ముల్లా, మొహమ్మద్ షారూఖ్, మహేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, ముత్యాల మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్ కమాన్ వద్ద డ్రైనేజీ ఓవర్ ఫ్లోతో రోడ్డుపై ప్రవహిస్తున్నదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆయన గురువారం స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వెంటేనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్‌నగర్ కమాన్ వద్ద డ్రైనేజీ లైన్ చిన్నది కావటంతో పొంగి ప్రవహిస్తోందని డ్రైనేజీ లైన్‌ను నాలుగు వైపులా వేసి పొడిగించి మ్యాన్‌హోల్ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుందని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మల్లేష్, పోశెట్టి గౌడ్, నాగరాజు, సాయిగౌడ్, ఎస్ఆర్‌పి సత్యనారాయణ, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

పరిశోధనలను ప్రోత్సహించాలి

● హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజే రావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీతో జెనెటిక్ కౌన్సెలింగ్ బోర్డు సభ్యులు కలిసి పనిచేయాలని వీసీ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో బోర్డ్ ఆఫ్ జెనెటిక్ కౌన్సెలింగ్‌తో కలిసి 8వ వార్షిక అంతర్జాతీయ సదస్సు-2023ను జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో జెనెటిక్ కౌన్సెలింగ్ వృత్తిని అభివృద్ధి చేయడానికి అకడమిక్, టీచింగ్ ట్రెనింగ్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కీలకోపన్యాసం చేసిన పద్మశ్రీ ప్రొఫెసర్ ఆర్ఎంకె బమేజాయ్ మాట్లాడుతూ జన్యుపరమైన రుగ్మతలను అంచనా వేయడానికి, రోగికి, వారి కుటుంబాలకు ఉత్తమ నిర్వహణను అందించడానికి వ్యక్తిగత విధానాన్ని అనుసరించాలని జన్యు సలహాదారులకు సూచించారు. పోస్టర్‌లతో దాదాపు 100 సారాంశాలు అందించారు. మూడు కేటగిరీల కింద ఆరు ఈ పోస్టర్లను ఎంపిక చేశారు. 'జెనెటిక్ కౌన్సెలింగ్ యొక్క టీచింగ్, ట్రెనింగ్ కోర్ స్కిల్స్' అనే అంశంపై హైబ్రిడ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొ.శివ కుమార్, ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు, డాక్టర్ క్యూ అన్నీ హసన్‌తోపాటు పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



అల్లాపూర్ డివిజన్‌లో..

రైతులకు 24 గంటల విద్యుత్ దండగన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బాగు కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వారి కోసం నీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని తెలిపారు. అలాంటి రైతులకు 3గంటల విద్యుత్ సరిపోతుందని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. – కూకట్‌పల్లి



కేపీహెచ్‌బీకాలనీలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ కార్పొరేటర్ పి. బాబూరావు తదితరులు

డిగ్రీ కాలేజీలో సెక్టోరల్ స్కిల్స్ కోర్సు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్ చెరు 2023- 24 విద్యా సంవత్సరానికి నూతనంగా సెక్టోరల్ స్కిల్స్ కోర్సుగా బీబీఏ కోర్సును 60 సీట్లుతో మంజూరు చేశారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజన్నప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాస్‌రూమ్, బోధనతో పాటు ఇండస్ట్రీలో అప్రెంటిస్‌షిప్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిగ్రీలో బీబీఏ కోర్సుకు అడ్మిషన్ పొందడానికి మూడవ విడతలో ఆన్ లైన్ దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులు ఈ నెల 14 తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పటాన్‌చెరు పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనూలో వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ మాట్లాడే జనాభాకు ఉర్దూ విశ్వవిద్యాలయం గురించి తెలియజేయాలని వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఆధ్వర్యంలో డీడీఈ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ డైరెక్టర్లు(ఆర్‌డీలు), అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్లు (ఏఆర్‌డీలు)కు రెండు రోజుల పాటు వర్క్‌షాప్ కమ్ ఓరియంటేషన్ నిర్వహించారు. అనంతరం డీడీఈ మాన్యువల్, ప్రోగ్రామ్ గైడ్‌లను ఆవిష్కరించారు.

ప్లాస్టిక్ వద్దు.. విద్యార్థుల అవగాహన ర్యాలీ

మాదాపూర్: మాదాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో గురువారం జరిగిన భూమి వారోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సమీనా మాట్లాడుతూ భూమిని కలుషితం చేసే కారకాలలో అత్యంత ప్రమాదకరమైనది ప్లాస్టిక్ అని వాటికి బదులుగా పేపర్,బట్ట సంచులను వాడాలని తెలిపారు. అనంతరం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ ర్యాలీని నిర్వహించారు.

ఓయూలో జీ-20 పోటీలు

లాలాపేట: జీ-20 యూనివర్సిటీ కనెక్ట్‌లో భాగంగా ఓయూ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొ. గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలోని నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'అర్బన్' ఉద్యోగుల ధర్నా

మాదాపూర్: మాదాపూర్‌లోని అర్బన్ కంపెనీ వద్ద గురువారం సీనియర్ ఉద్యోగులు ధర్నా చేశారు. వివిధ రకాల కారణాలు చూపుతూ లీడ్‌లను బ్లాక్ చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్బన్ కంపెనీలో శిక్షణ తీసుకున్న అనంతరం వారికి యాప్ ద్వారా పని ఇస్తున్నారని, ఆర్డర్‌ని బట్టి కంపెనీకి 20శాతం నుంచి 40శాతం వరకు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

భరత్‌నగర్‌కాలనీలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పనులను గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేయటం కోసం భారీ ఎత్తున నిధులు కేటాయించామని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పి. బాబూరావు, నాయకులు కృష్ణారెడ్డి, సోమయ్య, భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, విజయ్ కుమార్, వేణు, జ్యోతిగౌడ్, శ్రీను, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉస్మానియా యూనివర్సిటీలో మహా ధర్నా

లాలాపేట: ఈ నెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పరశురాం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. తమను రెగ్యూలరైజ్ చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల నుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును ఉపసంహరిస్తున్నాం

ఓయూ రిజిస్ట్రార్

లాలాపేట: గత ఐదేళ్ల నుంచి ఆదరణ తగ్గుతున్న నిజాం కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సును 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల తీరు తెన్నులను సమీక్షించిన తర్వాతనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యూనివర్సిటీ ఎప్పటికప్పుడు కోర్సుల ప్రగతిని సమీక్షిస్తోందన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డాటా సైన్స్ వంటి పలు కోర్సులను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. 2008లో ఐదేళ్ల సమీకృత కోర్సును అందుబాటులోకి తేచ్చామన్నారు. కాలక్రమేణా కోర్సులో చేరే వారి సంఖ్య తగ్గిపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సీట్లు సైతం భర్తీకాని పరిస్థితి ఉందని 250 సీట్లకు కేవలం 113 మంది మాత్రమే ఈ కోర్సులో చేరారని వివరించారు.

నాలుగోసారి కుంగిన రోడ్డు

● వాహనదారులకు తప్పని అవస్థలు

భాగ్యనగర్‌కాలనీ: అసలే ఈ రహదారి ఇరుకుగా ఉంటుంది. నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై దాదాపు నాలుగైదు సార్లు రోడ్డు కుంగిపోయి ఇబ్బందికరంగా మారింది. తాజాగా గురువారం ఉషాముళ్లపూడికి వెళ్లే రహదారి కుంగిపోవటంతో జీడిమెట్ల, ఎల్లమ్మబండ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

◆ ఆల్విన్‌కాలనీ ఉషాముళ్లపూడి రోడ్డు గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద రోడ్డు కుంగిపోయింది. దీంతో ఎల్లమ్మబండ, జీడిమెట్ల ప్రాంతాలకు వెళ్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. రోడ్డు కుంగిపోయే సమయంలో అటుగా వెళుతున్న అద్దాలను తరలించే మినీ వాహనం కుంగిపోయిన రోడ్డులో ఇరుక్కుపోయింది. దీంతో వాహన యజమాని, స్థానికులు కర్రలను సపోర్టుగా పెట్టి బయటకు తీశారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు..

◆ గతంలో ఇదే ప్రాంతలో రోడ్డు కుంగిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అప్పట్లో అధికారులు రోడ్డును తవ్వి మరల రోడ్డు వేశారు. 15 రోజుల పాటు మరమ్మతులు చేయగా వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తిగా చేయకపోవటంతో ఈ సమస్య పునరావృత్తం అయిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిశీలించి పూర్తిగా మరమ్మతులు చేస్తే తిరిగి సమస్య తలెత్తదని పేర్కొంటున్నారు. సాయంత్రం కావటంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో వాహనదారులు సమస్య ఎదుర్కొన్నారు.



ఉషాముళ్లపూడి దారిలో కుంగిన రోడ్డులో ఇరుక్కున్న వాహనం